క్లుప్తంగా

రీసర్వే-13 నోటిఫికేషన్‌పై అవగాహన



రీసర్వే-13 సారాంశాన్ని రైతులకు వివరిస్తున్న తహసీల్దార్

దెందులూరు: రైతులు రీసర్వే-13 నోటిఫికేషన్‌పై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని ఏలూరు రూరల్ తహసీల్దార్ జి.విజయ్‌కుమార్‌రాజు అన్నారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం కోమటిలంకలో రెవెన్యూ రీసర్వే-13 నోటిఫికేషన్‌పై డిప్యూటీ తహసీల్దార్ నాగమణి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. సభలో తహసీల్దార్ మాట్లాడుతూ సరిహద్దులు నిర్ణయించేటప్పుడు నిర్దిష్ట సమయం మేరకు రెవెన్యూ ఉద్యోగులు రైతులకు తెలియజేసి, వారి సమక్షంలో సరిహద్దులు నిర్ణయిస్తారని తెలిపారు. ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తెలియచేసి సమస్య పరిష్కారం చేసుకోవచ్చని వివరించారు. సభలో ఆర్ఐ అజయ్, వీఆర్‌ఓలు, సర్వేయర్లు, రైతులున్నారు.

లైఫ్ జాకెట్ల పంపిణీ



కోమటిలంక వాసులకు లైఫ్‌జాకెట్లు అందిస్తున్న తహసీల్దార్

దెందులూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు కోమటిలంక గ్రామంలో పడవ ప్రయాణంలో వాడేందుకు గ్రామస్తులకు లైఫ్ జాకెట్లను మంగళవాం అందజేశామని ఏలూరు రూరల్ తహసీల్దార్ జి.విజయకుమార్‌రాజు తెలిపారు. నాగిరెడ్డిగూడెం డ్యాం నుంచి అధిక మొత్తంలో నీటిని కిందికి విడుదల చేశారని చెప్పారు. కొల్లేరు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, వాగులు, వంకల్లో నీటిమట్టం పెరిగి ప్రవాహం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆర్ఐ అజయ్, సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 3 వరకు గడువు పొడిగించారని ఏలూరు జిల్లా నోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు గుత్తా గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2025 – 26 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో చేరడానికి ఇంటర్మీడియట్ లేదా తత్సమాన పరీక్ష పాసైన విద్యార్థులు సెప్టెంబర్ 3 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, ఈ మేరకు కళాశాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ గణితం కోర్సులు అందుబాటులో ఉన్నాయని, పూర్తి వివారలకు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించవచ్చని వివరించారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



ద కాఫీ హౌస్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నగరంలో మంగళవారం ఆహార నియంత్రణ అధికారులు తనిఖీలు చేశారు. స్థానిక కొత్త బస్టాండు ఎదురుగా సీఎంఆర్ మాల్ (మల్టీప్లెక్స్)లో ఉన్న ద కాఫీ హౌస్‌లో తనిఖీ నిర్వహించి, ఆహార పదార్థాల తయారీకి పలుసార్లు వినియోగించిన వంట నూనె గుర్తించారు. దీనిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కె.వెంకట రత్నం, ఫుడ్ సేఫ్టీ అధికారి రామరాజు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో వైఎస్ సుస్థిరం

- వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు శ్రీనివాస్
- మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి



సత్రంపాడులో నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: దేశానికే మార్గదర్శకంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిలో నిలిచిపోయారని వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమం పార్టీ ఏలూరు కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి, అనంతరం ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నాడు టీడీపీ హయాంలో చీకటి రోజులు గడుపుతున్న రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్సార్ పాదయాత్ర చేశారని, అనంతరం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. వైఎస్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ పథకం దేశానికే ఆదర్శంగా నేటికీ నిలుస్తుందన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్ మాట్లాడుతూ పేదపిల్లలకు ఉచితంగా ఉన్నత విద్య అందించిన మహనీయుడు వైఎస్సార్ అన్నారు. మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి మాట్లాడుతూ మహిళలను మహరాణులుగా చేసేందుకు, ఆర్థిక ప్రగతి సాధిచేలా నాడు

సున్నా వడ్డీకే రుణాలు అందించారని గుర్తు చేశారు. మాజీ సీఎం జగన్ మహిళలకు ఇళ్ల



వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వైఎస్‌కు నివాళి



వంగాయగూడెంలో వైఎస్సార్‌కు నివాళి

పట్టాలు, రుణాలు, ఆసరా, సున్నావడ్డీ వంటి అనేక పథకాలు అమలు చేసి తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి మాట్లాడుతూ నాడు జలయజ్ఞం పేరుతో పోలవరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టి కుడి, ఎడమ కాలువలు నిర్మించారని చెప్పారు. రైతన్నలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసి చూపించారని తెలిపారు. వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ మరణించినా నేటికీ ప్రతి గుండెల్లోనూ దేవుడిగా కొలువై ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ ఏలూరు నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, రాష్ట్ర నాయకులు దాసరి రమేష్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలారపు బుజ్జి, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు షమీం, ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు ఇనపనూరి జగదీష్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు పాతినవలస రాజేష్, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల బాజీ, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ల నాగవెంకట బాచి, యువజన విభాగం కార్యదర్శి దాలి వెంకటేష్, జిల్లా కార్యదర్శి జనార్ధన్, బుద్దాల రాము, బత్తిన మస్తాన్‌రావు, తులసి, సాంస్కృతిక విభాగం నాయకులు మేతర సురేష్, డాక్టర్స్ వింగ్ కొవ్వాడ దుర్గారావు, గ్రీవెన్స్ వింగ్ మద్దాల ఫణి, మేధావుల విభాగం బత్తుల యేసుపాదం, ఎంప్లాయిస్ వింగ్ ప్రభాకర్, బూత్ కమిటీ విభాగం ఎర్చెర్ల ఉమామహేశ్వరరావు, ఐటీ విభాగం పిల్లంగోళ్ల సత్యదేవ్, లీగల్ సెల్ ఏలూరు అధ్యక్షులు ప్రత్తిపాటి తంబి, అంగన్‌వాడీ విభాగం చీలి బుజ్జమ్మ, వాణిజ్య విభాగం పిట్టా ధనుంజయ్, వలంటీర్స్ విభాగం ఉయ్యాల గణేష్, ఆర్‌టీఐ వింగ్ బళ్ళ రమేష్, ఎస్టీ సెల్ అధ్యక్షులు దేవరకొండ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సత్రంపాడు సెంటర్‌లో..

వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 22, 21వ డివిజన్ల ఎగ్జిక్యూటివ్ మెంబర్లు శానంపూడి మోహన్, జగదీష్, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షులు చీలి బుజ్జమ్మ, ఏలూరు మేధావుల విభాగం అధ్యక్షులు యేసుపాదం, జిల్లా యువజన విభాగం ఈసీ సభ్యులు గంధం మహేష్, వైవీఎస్ సురేష్, జి.అనిల్, బి.మాణిక్యాలరావు, ఎన్ దాస్, కె.రాము, మండవ అప్పారావు, కార్యకర్తలు ఉన్నారు.

వంగాయగూడెం ప్రాంతంలో..

వైఎస్సార్ విగ్రహానికి పార్టీ ఏలూరు నగర ఎస్సీ సెల్ అధ్యక్షులడు ఇనపనూరి జగదీష్, నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, బట్టు విజయలక్ష్మి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఇకపై స్వతంత్రంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న సోమయ్య తదితరులు

ఏలూరు (టూటౌన్): ఇక నుంచి మున్సిపల్ వర్కర్ల యూనియన్‌ను స్వతంత్రంగా నిర్వహించుకుంటామని ఏలూరు నగర పాలక సంస్థకు చెందిన 600 మంది మున్సిపల్ కార్మికులు తీర్మానం చేశారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు అధ్యక్షతన మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి అంగులూరి జానుబాబు మాట్లాడారు. సీఐటీయూకి సోమయ్య చేసిన సేవలను మరిచి ఆయన్ని అవమానించి పంపించారని, తాము మాత్రం ఆయనతోనే ఉంటామని చెప్పారు.

బిల్లులు సకాలంలో క్లియర్ చేయాలి

ఏలూరు(మెట్రో): టెండర్ దశలో ఉన్న పనులు ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ల బిల్లులు సమయానికి క్లియర్ చేయాలని, ప్రజా ప్రతినిధుల అభ్యర్థనలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశించారు. మంగళవారం జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సూపరింటెండింగ్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇతర సాంకేతిక అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.

వైభవంగా గణనాథుని వేడుకలు



చిన్నారులను అభినందిస్తున్న ఈఓ



దక్షిణపు వీధిలో కొలువైన గణనాథుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గణపతి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వేదికల వద్ద స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. స్థానిక సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో స్వామి వారికి ఉదయం ప్రత్యేక పూజలు, అనంతరం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. 12వ డివిజన్, దక్షిణపువీధిలో తేజేష్ యూత్ ఆధ్వర్యంలో గణనాథుని వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులు పిండి వంటలతో మండపాలకు విచ్చేసి మొక్కులను తీర్చుకుంటున్నారు. ఈనెల 5న భారీ అన్న సమారాధన ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 7న గణపతి నిమజ్జన కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అండర్ గ్రౌండ్ బ్రిడ్జికి శాశ్వత పరిష్కారం చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎన్‌వీడీ ప్రసాద్

ఏలూరు (టూటౌన్): అధునాతన టెక్నాలజీ అందుబాటులో ఉన్నప్పటికీ పవర్ పేట రాజీవ్ స్నేహ వారధి (అండర్ గ్రౌండ్ బ్రిడ్జ్)కి శాశ్వత పరిష్కారం చూపించటంలో కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డీఎన్‌వీడీ ప్రసాద్‌లు విమర్శించారు. సీపీఎం నగర కమిటీ సమావేశం వైఎస్ కనకారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రవి, ప్రసాద్‌లు మాట్లాడుతూ దశాబ్దాలుగా రాజీవ్ స్నేహ వారధి పేరుతో కోట్ల రూపాయలు ప్రజల సొమ్ము ఖర్చు పెడుతున్న అధికారులు శాశ్వత పరిస్కారం చూపించలేకపోయారని ఆరోపించారు. నిరంతరం నీటీ ప్రవాహం కారణంగా అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలో ప్రయాణించే వాహనచోదకులు వాహన రిపేర్లు వచ్చి నష్టపోతున్నారని వివరించారు. ప్రతిరోజు భూమి నుంచి వస్తున్న నీరు తోడటానికి లక్షలు రూపాయిలు విద్యుత్ బిల్లులు, సిబ్బంది జీతాలు ఖర్చు పెట్టడానికి సిద్ధపడుతున్న పాలకులు శాశ్వత పరిష్కార మార్గాలు చూపలేకపోయారని తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో రాజీవ్ స్నేహ వారధి సమస్య పరిష్కారానికి ఆందోళనకు దిగుతామన్నారు. సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి పంపన రవి కుమార్, వీవీవీఎస్ ప్రసాద్ అరుణ కుమారి, జి.రవికిషోర్, ఎస్ఎన్ రమేష్, జె.గోపి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రతో ప్రజల కష్టాలు తెలుసుకున్న వైఎస్



వైఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకుని ముఖ్యమంత్రి అయిన వెంటనే సంక్షేమం అందించిన మహానాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు అన్నారు. మంగళవారం రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి రామ్మోహన్‌రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజశేఖరరెడ్డి అమలు చేసిన పథకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ, చెక్క గుప్తా, దండు బోయినచంద్రశేఖర్, కాంగ్రెస్ తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు పాలకుర్తి ప్రభాకర్ చౌదరి, లంక రామ్మోహన్, గౌడు రంగబాబు, కొమ్మన సాంబశివరావు, సాదేబాబు ప్రసాద్, తాళ్లూరి చక్రవర్తి, సుంకర సుబ్బారావు, వల్లకవి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా వరద ప్రవాహం



శ్రీపర్రు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు బ్రిడ్జి వద్ద నీటి ఉధృతంగా ప్రవహిస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో నాటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కొల్లేటి గ్రామాల ప్రజల రాకపోకలు, అసౌకర్య పరిస్థితులను వివరించి నూతన బ్రిడ్జిని నిర్మించారు. ఇది నేడు కొల్లేరు ప్రజలందరికీ సౌకర్యవంతంగా ఉంది. బ్రిడ్జి స్థాయిలో నీటి ప్రవాహం వెళుతున్నా రాకపోకలకు ఇబ్బంది లేదని కొల్లేరు ప్రజలు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, మాజీ సీఎం వైఎస్ జగన్ లకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

వైఎస్సార్ కాలనీలో నిత్యావసరాల పంపిణీ



వైఎస్ఆర్ కాలనీలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక వైఎస్సార్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చదివే 103 మంది విద్యార్థులకు సంబంధించి 75 కుటుంబాలకు ట్రేస్ ఇండియా, టుగెదర్ ఇండియా, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం బస్తా, ఒక కేజీ కందిపప్పు, కేజీ వేరుశనగ గుళ్ల, కేజీ బెల్లం ట్రేస్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ దిడ్ల ఆంజిలో, స్వర్ణ కుమారి దంపతులు పంపిణీ చేశారు. వీటి విలువ రూ.1,35,000 అన్నారు. వర్షాకాలం పనులు లేక ఇబ్బంది పడుతున్న కుటుంబాలను గుర్తించి వారికి చేయూత అందించామన్నారు. తమ సంస్థ ద్వారా పేద పిల్లలను చదివిస్తున్నామని, భారమైన వారు తమ పిల్లలను అప్పగిస్తే ఉచిత భోజన వసతులు కల్పించి చదివిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్‌టీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జీజేఏ స్టీవెన్, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ ముస్తఫా అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.చిట్టి లక్ష్మి, ఉపాధ్యాయినులు బి.కిరణ్ కుమారి, జరీనా బేగం, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్, షేక్ దావూద్, ఏసుబాబు, ఎస్ఎంసీ చైర్మన్ ఎద్దు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బాలల దత్తత ధ్రువీకరణ



బాలిక దత్తత ధ్రువీకరణ అందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (మెట్రో): మహిళాభివృద్ధి, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహలో ఆశ్రయం పొందుతున్న ఇద్దరు బాలికలు, ఒక బాలుడిని తెలంగాణకు చెందిన రెండు కుటుంబాలకు, బాలసదనం దెందులూరులో ఆశ్రయం పొందుతున్న ఒక పాపను తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన దంపతులకు రెండు నెలల క్రితం పాస్టర్ కేర్ ఇచ్చారు. వారికి వ్యక్తిగత కుటుంబ సర్దుబాట్ల అనంతరం కలెక్టర్ కె.వెట్రిసెల్వి చేతుల మీదుగా తుది దత్తత ధ్రువీకరణ పత్రాలను మంగళవారం అందజేశారు. దత్తత తీసుకున్న బాలలతో వారి కుటుంబ జీవన విధానం, ఆహారపు అలవాట్లు, విద్య ఇతర సౌకర్యాల కల్పన తదితర వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఇరువురు సంతృప్తి వ్యక్తపరచిన తరువాత వారికి దత్తత బాలలు వారి సొంత బిడ్డలుగానే ధ్రువీకరించే విధంగా పత్రాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి పి.శారద, జిల్లా బాలల సంరక్షణ అధికారి సీహెచ్ సూర్య చక్రవేణి, శిశు గృహ మేనేజర్ భార్గవి, డీసీపీయూ సిబ్బంది పాల్గొన్నారు.

రాజవరంలో అగ్నిప్రమాదం



రాజవరం గ్రామంలో దగ్ధమైన ఇల్లు

కొయ్యలగూడెం: రాజవరం గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించి ఓ కుటుంబం నిరాశ్రయులైంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం దుగ్గిరాల రామారావు ఇంటిలో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ ట్యూబ్ ఊడిపోవడంతో మంటలు వ్యాపించాయి. ఇంటిలో ఉన్న సుమారు రూ.5 లక్షలు విలువైన సామగ్రి దగ్ధమైంది.

పంచాయతీలకు నిధులు కేటాయించాలి



ఎంపీడీఓ, తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సర్పంచ్‌లు

బుట్టాయగూడెం: మండలంలోని ప్రతి పంచాయతీకి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు కేటాయించి, అభివృద్ధి పనులు చేపట్టాలని సర్పంచ్‌లు ఎంపీడీఓ కె.జ్యోతిని కోరారు. మంగళవారం సాయంత్రం సర్పంచ్‌ల బృందం ఎంపీడీఓను కలిశారు. పంచాయతీల్లో రోడ్లు, ఇతర పనులు జరిగేలా సహకరించాలని కోరారు. ప్రతినెలా వృద్ధులు, వికలాంగులకు ఇచ్చే పింఛను పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులకే తప్ప తమకు, ఎంపీటీసీలకు కనీస సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ సమాచారం కూడా తమకు ఇవ్వడంలేదని సర్పంచ్‌లు తహసీల్దార్ పీవీ చలపతిరావు దృష్టికి తీసుకెళ్లారు.

సమావేశం వాయిదా

మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఏర్పాటుచేసిన బుట్టాయగూడెం మండల పరిషత్ సమావేశానికి ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో వాయిదా వేశారు. తమకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని సర్పంచ్‌లు కూడా హాజరుకాలేదు. దీంతో సమావేశం వాయిదా వేశామని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	37
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	30
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

పేదల సంక్షేమానికి పాటుపడిన వైఎస్సార్



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వైఎసార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పాలగూడెం సర్పంచ్ సునీత, పార్టీ నాయకులు

దెందులూరు: పేద, బడుగు బలహీన, ముస్లిం మైనారిటీ వర్గాల అభ్యున్నతి, సంక్షేమానికి పాటుపడిన ఏకైక మహోన్నత వ్యక్తి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ అన్నారు. మంగళవారం కొల్లేరు గ్రామాలు గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు భలే బలరామయ్య, నాగరాజు, బలే సత్యప్రసాద్, గోపి, శ్యామ్, అంతర్వేది కార్యకర్తలు ఉన్నారు. పాలగూడెంలో సర్పంచ్ పి.సునీత, ఉప సర్పంచ్ నిరంజన్, ఎంపీటీసీ, పార్టీ నాయకులు ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.